నమస్తే తెలంగాణ
సిద్ధిపేట

I హైదరాబాద్, శుక్రవారం 21 మార్చి 2025 | SIDDIPET

దళితులకు బడ్జెట్‌లో కోత

గజ్వేల్, మార్చి 20: దళితులకు గతేడాది కంటే ఈసారి బడ్జెట్‌లో రూ.6512 కోట్లు తగ్గించి అన్యాయం చేశారు. ఎస్సీ ప్రత్యేకాభివృద్ధికి గత బడ్జెట్‌లో రూ.33,127వేల కోట్లను కేటాయించారు. ఈసారి కేవలం రూ.26,615 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. 2024-25 బడ్జెట్‌లో ఎస్సీలకు కేటాయించిన రూ.33,127 వేల కోట్ల బడ్జెట్‌లో కేవలం రూ.9824 వేల కోట్లను మాత్రమే ఖర్చు చేసి దళితులకు అన్యాయం చేశారు. ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి, విద్య, వైద్య రంగాలకు కేటాయించిన బడ్జెట్‌లను సవరించి పెంచాలి.

-పి.శంకర్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి, గజ్వేల్

క్రీడలకు తగ్గిన ప్రోత్సాహం..

జిన్నారం, మార్చి 20: రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడలకు రూ.465 కోట్లు కేటాయించడం నిరుత్సాహపరిచింది. బీఆర్ఎస్ హయాంలో ఊరూరా తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. వాటికి సరిపడా క్రీడా సామగ్రిని సమకూర్చేలా బడ్జెట్ కేటాయింపులు జరిగితే బాగుండేది. 1 నుంచి 7 తరగతి వరకు ప్రాథమిక స్థాయిలోనే గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను తయారు చేసేందుకు ఈ బడ్జెట్లో రూ.1000 కోట్ల వరకు కేటాయింపులు చేయకపోవడం బాధాకరం. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలపై దృష్టి సారించాలి.

– పవన్‌రాజ్, పీఆర్‌టీయూ టీఎస్ అసోసియేట్ స్టేట్ అధ్యక్షుడు, జిన్నారం

విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వలేదు..

రామచంద్రాపురం, మార్చి 20: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎన్నికల సమయంలో విద్యారంగం అభివృద్ధికి 15శాతం నిధులు బడ్జెట్‌లో కేటాయిస్తామని చెప్పి ఇప్పుడు కేవలం 7.57 శాతం మాత్రమే నిధులు కేటాయించడం నిరాశపర్చింది. 2025-26 బడ్జెట్‌లో విద్యకు కేవలం రూ.23,108 కోట్లు కేటాయించడం ఏమాత్రం సరికాదు. ఈ నిధులతో సంక్షోభంలో ఉన్న ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం అసాధ్యం.

– ధననిరి ప్రకాశ్, బాలలహక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యాదర్శి, ఆర్సీపురం

కార్మికులకు తీవ్ర అన్యాయం..

సిద్దిపేట, మార్చి 20: రాష్ట్ర బడ్జెట్ కార్మికులకు ఏమాత్రం మేలు చేకూర్చేలాలేదు. కార్మిక రంగానికి రూ.900 కోట్లను నామమాత్రంగా కేటాయించారు. మున్సిపల్ కాంట్రాక్ట్, గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల పెంపు గురించి, ఉద్యోగుల రెగ్యులరైజేషన్ గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. ఈ బడ్జెట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. – గోపాలస్వామి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి

క్రీడారంగం నిర్వీర్యం..

సిద్దిపేట, మార్చి 20: బడ్జెట్‌లో క్రీడారంగానికి అశించిన కేటాయింపులు జరగలేదు. క్రీడలను నిర్వీర్యం చేసేలా కేటాయింపులు ఉన్నాయి. రాష్ట్రంలో ఒలింపిక్స్ నిర్వహిస్తామని సీఎం రేవంత్ గొప్పలు చెబుతున్నారు. కానీ, బడ్జెట్ చూస్తే ఒలింపిక్స్ కాదు కదా తెలంగాణ జాతీయ క్రీడలు నిర్వహించే పరిస్థితులో లేదని తెలుస్తున్నది. క్రీడాకారులను ప్రభుత్వం నిరాశ పరిచింది.

–మల్లికార్జున్, క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, సిద్దిపేట

బీసీలకు అన్యాయం..

సిద్దిపేట టౌన్, మార్చి 20: రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడం అన్యాయం. జనాభాలో 17శాతం ఉన్న ఎస్సీలకు రూ.40 వేల కోట్లు, 10 శాతం ఉన్న ఎస్టీలకు రూ.17 వేల కోట్లు కేటాయించారు. బీసీలకు మాత్రం రూ.11,405 కోట్లు కేటాయించడం దారుణం. కాంగ్రెస్ సర్కార్ బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నది. బీసీలకు తీరని అన్యాయం చేసిన రేవంత్‌రెడ్డి సర్కార్ సమాధానం చెప్పాలి.

– ముదిగొండ శ్రీనివాస్, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కన్వీనర్, సిద్దిపేట

హామీలకు.. బడ్జెట్‌కు పొంతన లేదు..

సిద్దిపేట టౌన్, మార్చి 20: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ఏమాత్రం పొంతనలేదు. పేదలకు ఏమాత్రం ఊరట నిచ్చేలా లేదు. ఆరు గ్యారెంటీలకు కేటాయింపులు సరిగ్గా చేయలేదు. 40లక్షల మంది పైగా ఇండ్లు లేని నిరుపేదలు ఉంటే కనీసం నాలుగున్నర లక్షల మందికి కూడా కేటాయింపులు సరిగ్గా చేయలేదు. పేదవారికి ఇండ్లు ఇచ్చే పరిస్థితి లేదు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. ఆర్టీసీ పరిరక్షణకు, ఉద్యోగులను ఇచ్చిన హామీలను విస్మరించారు. సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు సరిగ్గాలేవు.

– ఆముదాల మల్లారెడ్డి, సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి

విద్యపై చిన్నచూపు..

కొమురవెల్లి, మార్చి 20: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖకు మొండిచెయ్యి చూపించింది. విద్యాశాఖకు కేటాయించిన బడ్జెట్ గతేడాది కంటే 0.20శాతం తగ్గింది. అంకెల్లో రూ.1816 కోట్లు పెరిగినట్లు ఉన్న శాతాల్లో చూస్తే గతేడాది కంటే తగ్గింది. విద్యాశాఖ పరిధిలో ఉన్న 26,067 పాఠశాలలను గాలికి వదిలేసి యంగ్ ఇండియా, రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి ప్రభుత్వం మాట్లాడడం సరికాదు.

– గ్యార ప్రవీణ్‌కుమార్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు-కొమురవెల్లి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

ఒట్టి మాటలు చెబుతున్నరు..

కోహీర్, మార్చి 20: ఎన్నికల్లో గెలిచిన వంద రోజుల్లో పింఛన్లను నాలుగు వేల రూపాయలు చేస్తామన్నారు. సంవత్సరం గడిచినా ఇంత వరకు పింఛన్ల పెంపు గురించి చెప్పడం లేదు. మహిళలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నరు. కల్యాణలక్ష్మి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తమన్నరు. నాలుగు వేల పింఛన్ లేదు. తులం బంగారం లేదు. కేవలం మాటలతోనే నడిపిస్తున్నరు.

– పుష్పమ్మ, చింతల్‌ఘాట్, కోహీర్ మండలం (సంగారెడ్డి జిల్లా)

పటాన్‌చెరు మెట్రో ఊసేలేదు..

పటాన్‌చెరు, మార్చి 20: వ్యవసాయానికి పెద్దపీట వేయలేదు. రైతులను ప్రోత్సహించాలనే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి కరువైంది. విద్య, ఆరోగ్యాలకు కేటాయింపుల్లో అన్యాయం జరిగింది. పటాన్‌చెరుకు మెట్రో రైలు రావడంపై స్పష్టమైన ప్రకటన, బడ్జెట్ కేటాయింపులు లేవు. లక్షలాది మంది తిరిగే పారిశ్రామికవాడలకు మెట్రో రైలు సౌకర్యం అత్యవసరం. ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలి. నిరుద్యోగులకు స్వయం ఉపాధికి రుణాలివ్వాలి. –చాపల మధు, నల్లవల్లి గ్రామం

విద్యకు అరకొర నిధులు

హుస్నాబాద్ టౌన్, మార్చి 20: విద్యాశాఖకు కాంగ్రెస్ ప్రభుత్వం సరిపడా నిధులను కేటాయించలేదు. కోటారీ కమిషన్ నివేదిక ప్రకారం విద్యాశాఖకు కేంద్ర బడ్జెట్‌లో 10శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులను కేటాయించాలని సూచించింది. ఏ ప్రభుత్వం కూడా విద్యాశాఖకు తగిన నిధులు కేటాయించలేదు. సర్కారు విద్య నీరుగారుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వానివి మాటలు తప్ప చేతల్లో కనిపించడం లేదు. – జెరిపోతుల జనార్దన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దిపేట

మహిళలపై చిన్నచూపు..

కోహీర్, మార్చి 20: కాంగ్రెస్ పార్టీకి మహిళలపై మమకారం లేదు. ఎన్నికల సమయంలో రెండు వేల ఐదు వందల రూపాయలు ఇస్తామని చెప్పిన్రు. మహిళలు కూడా వారిని నమ్మి ఓట్లు వేసిండ్రు. కానీ, ఇప్పటికి రెండు సార్లు అసెంబ్లీలో బడ్జెట్ పెట్టినా ఆ హామీని అమలు చేసేందుకు పైసలు కేటాయించలేదు. దీన్నిబట్టి కాంగ్రెస్‌కు మహిళలపై ఎంత ప్రేమ ఉందో తెలుస్తున్నది. ఆ పార్టీది ఓట్ల కోసం అబద్ధపు ప్రచారం. – ప్రేమల, మధ్రి, కోహీర్ మండలం (సంగారెడ్డి జిల్లా)

రేపు కొమురవెల్లికి

ఎమ్మెల్సీ కవిత రాక

కొమురవెల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, గోపు సదానందం

కొమురవెల్లి, మార్చి 20: రేపు కొమురవెల్లికి ఎమ్మెల్సీ కవిత రానున్నట్లు బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు గోపు సదానందం తెలిపారు. గురువారం కొమురవెల్లిలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు చట్టసభల్లో ఆమోదం పొందిన సందర్భంగా భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత శనివారం కొమురవెల్లికి చేరుకొని మల్లికార్జున స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. కవితకు ఆహ్వానం పలికేందుకు బీసీ సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు మహిళలు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కిషన్, కిష్టయ్య, నర్సింహులు, మాజీ ఉపసర్పంచ్ శ్రీధర్, కనక మల్లేశం, సురేశ్, మల్లేశం పాల్గొన్నారు.

మిరుదొడ్డి: కాసులాబాద్‌లో వచ్చే కొద్దిపాటి మిషన్ భగీరథ నీళ్లను బేసిన్ గిన్నెపెట్టి పట్టుకుంటున్న శ్యామవ్వ

ఇంటింటికీ సురక్షిత తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించారు. ప్రతి జనావాసానికి శుద్ధనీటిని అందించాలనే లక్ష్యంతో పైప్‌లైన్ నిర్మాణాన్ని చేపట్టి, నల్లా కనెక్షన్లు ఇచ్చి సురక్షిత తాగునీటిని సరఫరా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలుచేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నేడు మళ్లీ తాగునీటి కటకట మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని సరిగ్గా నిర్వహించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇందులో పనిచేసే సిబ్బందికి సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం,నిర్వహణను పట్టించుకోవడంతో పథకం లక్ష్యాన్ని నిర్వీర్యం చేస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గొంతెండుతోంది

సిద్ధిపేట జిల్లాలో తగ్గిన 'మిషన్ భగీరథ' నీటి సరఫరా

- కాంగ్రెస్ వచ్చాక 68 ఎంఎల్‌డీకు తగ్గిన సరఫరా
- జిల్లాలో 2,06,118 నల్లా కనెక్షన్లు
- 506 గ్రామపంచాయతీలు, 760 హ్యాబిటేషన్లకు నీటి సరఫరా
- 2024-25 సంవత్సరానికి రూ.8 కోట్ల నిర్వహణ ఖర్చులు పెండింగ్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

బీఆర్ఎస్ హయాంలో నిత్యం మంగోలు గ్రిడ్ నుంచి 72 ఎంఎల్‌డీ నీటర్ల నీటి సరఫరా

సిద్దిపేట, మార్చి 20: సిద్దిపేట జిల్లాలో మొత్తం 506 గ్రామపంచాయతీల పరిధిలో 760 జనావాసాలకు మిషన్ భగీరథ పథకంలో నీళ్లందిస్తున్నారు. దీనికోసం 2793 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణం చేపట్టారు. 1515 తాగునీటి ట్యాంకుల ద్వారా 2,06,118 నల్లా కలెక్షన్లు ఇచ్చి మిషన్ భగీరథ ద్వారా నీటిని అందిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసుకువచ్చి మంగోల్ వద్ద నీటిని శుద్ధిచేసి సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, నియోజకవర్గాలకు,జనగామ నియోజకవర్గంలోని చేర్యాల, ధూళిమిట్ట, మద్దూరు, కొమురవెల్లి మండలాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్ పట్టణంతో పాటు అక్కన్నపేట, బెజ్జంకి, కోహెడ, హుస్నాబాద్ రూరల్ మండలాలకు లోయర్ మానేర్ డ్యామ్ నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మంగోలు గ్రిడ్ ద్వారా ప్రతిరోజు 72 మిలియన్ లీటర్లు నీటిని తాగునీటి కోసం సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఈ గ్రిడ్ ద్వారా 68 నుంచి 70 మిలియన్ లీటర్ ఫర్ డే(ఎంఎల్‌డీ)వాటర్‌ను సరఫరా చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో 72 ఎంఎల్‌డీల వాటర్ సప్లయ్ చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం ప్రతిరోజు మూడు నుంచి నాలుగు ఎంఎల్‌డీ నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఈ మంచి నీటి సరఫరా కోసం నెలకు రూ. 69 లక్షలను ప్రభుత్వం మెయింటెనెన్స్ ఖర్చు చేయగా, 2024-25 సంవత్సరానికి ఈ నిర్వహణ ఖర్చుల డబ్బులు రూ.8 కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయకుండా పెండింగ్ పెట్టింది.దీంతో మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయాలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించక పోవడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. గ్రామపంచాయతీలు నిధుల కటకటతో సతమతమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నీటి సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఫోన్ ట్యాపింగ్ కేసులో న్యాయమే గెలిచింది

- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి, ఎర్రోళ్ల శ్రీనివాస్

గజ్వేల్, మార్చి 20: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అక్రమంగా ఎన్ని కేసులు పెట్టిస్తున్నా చివరకు న్యాయం గెలుస్తుందని, మాజీ మంత్రి హరీశ్‌రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసు పెడితే చివరకు న్యాయం గెలిచిందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లో హరీశ్‌రావును ఆయన నివాసంలో వంటేరు ప్రతాప్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి వారసులు పంజాగుట్ట పీఎస్‌లో హరీశ్‌రావుపై పెట్టిన అక్రమ కేసును హైకోర్టు కొట్టివేయడం సంతోషంగా ఉందన్నారు. నిరాధార మైన ఆరోపణలు చేసి కక్షపూరితంగా కేసులు పెట్టించి ప్రజల్లో పలుకుబడిని తగ్గించే ప్రయత్నం చేసిన ప్రభుత్వానికి చెంపచెల్లు మనేలా కోర్టు తీర్పు వచ్చిందని తెలిపారు. కక్ష సాధింపులు మానుకుని హామీలు అమలు చేసి ప్రజల మన్ననలు పొందాలని ప్రభుత్వాని ఆయన హితవు పలికారు. ఎన్ని కేసులు పెట్టినా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలు ఆపమని పేర్కొన్నారు. ప్రతిక్షణం ప్రజల్లో ఉండి, ప్రజల మేలుకోసం తపించే నాయకుడు హరీశ్‌రావును బెదిరింపులకు గురిచేయాలని చూడడం మానుకొని ప్రజాపాలనపై దృష్టిపెట్టాలన్నారు.

హైకోర్టు తీర్పు రేవంత్ సర్కారుకు చెంపపెట్టు: కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి 20: ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపుతో అక్రమ కేసులు బనాయించి వేధించాలనుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి హైకోర్టు తీర్పు గుణపాఠం అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుపై కక్షపూరితంగా రేవంత్ సర్కారు పెట్టిన ఫోన్ ట్యాపింగ్ అక్రమ కేసు హైకోర్టు విచారణలో ఆధారాలు లేక కొట్టివేసినందుకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గురువారం హరీశ్‌రావును ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

23న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

సిద్దిపేట, మార్చి 20: సిద్దిపేట పట్టణంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అత్తర్ పటేల్, కౌన్సిలర్లు వజీర్, మోయిజ్, ఇర్షాద్ హుస్సేన్ తదితరులు తెలిపారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ.. రంజాన్ సందర్భంగా ఏటా హరీశ్‌రావు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం సాయంత్రం సిద్దిపేటలోని మదీనా ఫంక్షన్‌హాల్ పక్కన గల ఈద్గా వద్ద ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఫరూక్‌హుస్సేన్ హాజరవుతారని, ముస్లింలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో అతిక్, సయీద్, బాబ్ జానీ, అహ్మద్, అక్బర్, చాంద్, ఆదాబ్ మోహిజ్, షౌకత్, ఆయాన్ బాబా తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే గజ్వేల్ అభివృద్ధి

- పెండింగ్ కాలువలు పూర్తిచేయాలి
- కొండపోచమ్మ నుంచి మునిగడప చెరువు నింపాలి
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

పెండింగ్ కాలువను పరిశీలిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్, మార్చి 20: పదివేల కోట్ల రూపాయలతో గజ్వేల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కిందని, కేసీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్, బీజేపీ నాయకులకు లేదని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గురువారం జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప గొల్లపల్లి శివారులో పెండింగ్ కాలువ పనులను మండల నాయకులు, రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ జలాశయాలను నిర్మించి గజ్వేల్ నియోజకవర్గంలో వేలాది ఎకరాలకు నీళ్లు అందించారన్నారు. జగదేవపూర్ మండలంలో 99శాతం కాలువ పనులు పూర్తయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన ఒక్కశాతం పనులు పూర్తిచేయడం లేదని విమర్శించారు. మునిగడప వద్ద కాలువ పనులు పూర్తి చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. మునగడప చెరువులో భూగర్భ జలాలు అడుగంటి చుట్టుపక్కల 15 గ్రామాల్లో పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం చొరవ తీసుకొని మండలంలోని మునిగడప చెరువును నింపేలా ఆదేశాలు ఇవ్వలని డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి రేవంత్‌రెడ్డికి లేదని విమర్శించారు. గజ్వేల్‌లో ఇరిగేషన్ కార్యాలయాన్ని కొడంగల్ తరలించారని తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు నర్సారెడ్డి కలెక్టరేట్ నుంచి రాజ్‌భవన్‌కు పాదయాత్ర చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. వేల కోట్లతో గజ్వేల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే గజ్వేల్ ప్రాంతంలో అందరి రైతులకు పంట రుణ మాఫీ చేయాలని, అందరికీ రైతు భరోసా ఇవ్వాలని పాదయాత్ర చేయాలని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు రంగారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, యాదవరెడ్డి, కవిత, చంద్రశేఖర్, మహేందర్, బాలకిషన్, శ్రీశైలం యాదవ్,అయిలయ్య, కిరణ్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

పోచాపూర్ ఆయకట్టుకు నీళ్లివ్వాలి

- మాజీ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి భూపాల్‌రెడ్డి

పోచాపూర్ శివారులోని నల్లవాగు ఆయకట్టు కింద నీరు లేక ఎండుతున్న వరిపొలం

నారాయణఖేడ్, మార్చి 20: నల్లవాగు ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ-3 కింద ఉన్న పోచాపూర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి భూపాల్‌రెడ్డి కోరారు. గురువారం మాజీ ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. మొత్తం ఏడు డిస్ట్రిబ్యూటర్ల ద్వారా ఆయకట్టుకు నీటిని విడుదల చేయాల్సి ఉండగా, నల్లవాగు ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ 3వ డిస్ట్రిబ్యూటర్‌కే నీటిని విడుదల చేయకపోగా, దిగువన ఉన్న డిస్ట్రిబ్యూటర్ల కింద ఆయకట్టు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తైబందీ పరిధిలో ఉన్న పోచాపూర్ ఆయకట్టుకు నీరు విడుదల చేయని కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, ఆవేదనతో రైతులు తన వద్దకు వచ్చి మొర పెట్టుకుంటున్నారని తెలిపారు. రైతుల పంటలు ఎండకుండా వెంటనే పోచాపూర్ ఆయకట్టుకు నీరు వదలాలని తాను అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. కలెక్టర్, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు చొరవ చూపి నీటిని విడుదల చేసి పంటలు కాపాడాలని భూపాల్‌రెడ్డి కోరారు.

బ్లాక్‌మెయిల్ జ్యోతిష్యుడు అరెస్ట్

మెదక్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, వెనకాల నిందితుడు బొమ్మెర బాపు స్వామి

మెదక్ అర్బన్, మార్చి 20: మంత్రాలతో సమస్యలు పరిష్కరిస్తానని నమ్మించి మహిళలకు మత్తు మందు ఇచ్చి శారీరకంగా వాడుకుని వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేస్తున్న దొంగ జ్యోతిష్యుడిని మెదక్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన బుడగ జంగం బొమ్మెర బాపు స్వామి అలియాస్ శివస్వామి జ్యోతిష్యం చెబుతూ ఆర్యోగం మెరుగు పేరిట పలు పూజలు చేస్తుంటాడు. మెదక్‌తో పాటు పలు జిల్లాల్లో సంచరిస్తూ జ్యోతిష్యం చెప్పేవాడు. వివిధ సమస్యలతో తనవద్దకు వచ్చిన మహిళలకు నిమ్మకాయ, పసుపు కుంకుమ వాసనలు చూపించి, నీటిలో నిద్రమాత్రలు కలిపి తాగించేవాడు. సదరు మహిళ స్పృహ కోల్పోయిన తర్వాత శారీరకంగా అనుభవించి మొబైల్‌లో వీడియోలు తీసేవాడు. కొన్ని రోజుల తర్వాత ఆ మహిళలకు ఫోన్ చేసి నగ్నంగా వీడియోలు ఉన్నాయని బెదిరించి బ్లాక్ మెయిల్ చేసేవాడు. బాధిత మహిళల ఆర్థిక స్తోమతను బట్టి వేల నుంచి లక్షల రూపాయలు డిమాండ్ చేసి వసూలు చేసేవాడు. వసూలు చేసిన డబ్బులతో ఐఫోన్, బైక్ వినియోగిస్తూ రాజభోగాలు అనుభవిస్తున్నాడు. ఫిర్యాదుల మేరకు మెదక్ జిల్లా పోలీసులు అతడిపై నిఘా పెట్టి నర్సాపూర్‌లో అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద మంత్రాలకు సంబంధించిన సామగ్రితో పాటు షర్ణకోల, పసుపు, కుంకుమ, గజ్జెలు, స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాచగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

- ముగిసిన శ్రీసూక్తరుద్రపారాయణం

వర్గల్, మార్చి 20 : నాచగిరి లక్ష్మీనరసింహస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి పర్యవేక్షణలో శ్రీసూక్త రుద్ర పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి 10గంటలకు లక్ష్మీసమేత నరసింహస్వామి కల్యాణం జరుగుతుందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఆగమ శాస్త్రం ప్రకారం ప్రత్యేకంగా సిద్ధం చేసిన కల్యాణ మండపం వద్దకు దేవతామూర్తులను భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల మధ్య తీసుకువస్తారు. శ్రీసూక్తరుద్రపారా